క్లుప్తంగా

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

హుజూరాబాద్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ములుగు ఫారెస్ట్ అధికారి మాధవి శీతల్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామం కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.శంకర్ అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు జీవితాన్ని ఉన్నతంగా అభివృద్ధి చేసుకోవాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా అభ్యుదయం మాత్రమే సమాజానికి పురోగతి కలిగిస్తుందని, విద్యార్థులకు భవిష్యత్‌లో పనిచేసేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు, ఉన్నత విద్యలో విదేశీ ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. అనంతరం ఆఫీసర్‌ను మహిళా అధ్యాపకులు శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో కళాశాల రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాజేశ్వర్‌రావు, మహిళా అధ్యాపకులున్నారు.

వంటపాత్రలు పంపిణీ



వంట పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

మానకొండూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు మధ్యాహ్న భోజన వంట పాత్రలను ఎంఈవో మధుసూదనాచారి సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందజేసిన వంట సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మధ్యాహ్న భోజన కార్యక్రమం తర్వాత వంట పాత్రలను శుభ్రం చేసి భద్రపరచాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకారం అందించాలి



కూలర్‌ను ప్రారంభిస్తున్న శరత్‌కుమార్

జమ్మికుంట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థి ముక్క శివకుమార్ కుమారుడు డా.ముక్క శరత్‌కుమార్ రూ.50 వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫెయిర్ కూలర్ వితరణ చేశారు. ప్రిన్సిపల్ బి.రమేశ్ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ రామస్వామి, అధ్యాపకుల సమక్షంలో సోమవారం ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందించాలని ప్రిన్సిపల్ రమేశ్ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ముక్క శరత్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఓదెల్‌కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యాలాల మల్లికార్జునస్వామి జాతర

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో సోమవారం శ్రీ యాలాల మల్లికార్జునస్వామి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను పూలతో అలంకరించారు. పెద్దపట్నం వేసి బోనాలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం మల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహించారు. స్వామివారి చరిత్రను కళాకారులు ఒగ్గుకథ రూపంలో వినిపించారు. నాయకులు వెంకన్న, మల్లయ్య, రాజయ్య, అయిలయ్య, రమేశ్, కుమార్, రాజు, అనిల్,మాజీ సర్పంచ్ వెంకటేశం, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

భూమిపూజ

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో ఏడుగుట్ట మల్లికార్జున స్వామి ఆలయం ఆవరణలో ధ్వజస్తంభం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన బొద్దు తిరుపతి దంపతులు ముగ్గుపోసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రెడ్డి సంపత్‌రెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులే అడ్డుకున్నారు

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయకుండా గతంలో అడ్డుకున్నది బీఆర్‌ఎస్ నాయకులేనని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ జిల్లా కోఆర్డినేటర్ మ్యాక వినోద్ అన్నారు. మధురానగర్ చౌరస్తా ప్రజాపాలన కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్వగ్రామం బూర్గుపల్లిని మండలం చేయడానికి గర్షకుర్తి మండలం కాకుండా అడ్డుకున్నారని, అప్పటి సీఎం కేసీఆర్ గర్షకుర్తిని మండలంగా ఏర్పాటు చేస్తామన్న హామీని విస్మరించారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బుచ్చయ్య, మహేశ్, సుధర్శన్, రామంచరాజు తదితరులు ఉన్నారు.

‘ఉపాధి’కి దూరం

- హుజూరాబాద్ మున్సిపాలిటీలో కలవనున్న మూడు గ్రామాలు
- విలీన గ్రామాల్లోని ఈజీఎస్ కూలీలకు పనికరువు
- వ్యవసాయానికి ఉపాధి హామీని అనుసంధానం చేయాలని వినతి



పెద్దపాపయ్యపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

హుజూరాబాద్: దేశానికి గ్రామాలే పట్టుకొమ్మలని..గ్రామాలు అభివృద్ధి చెందింతేనే దేశం అభివృద్ధి చెందుతుంది అన్న మహాత్ముడి మాటలను నిజం చేయాలనే సంకల్పంతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపి వారిని ఆర్థికంగా ఆదుకోవాలని 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. గ్రామాల్లోని పేదలకు ఏడాదిలో వంద రోజుల పని కల్పించడం పథకం ఉద్దేశం. కానీ ఈ పథకానికి అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ కరువైంది. దీంతో నిరుపేద ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. వ్యవసాయంతో నష్టాలను చవిచూస్తున్న రైతులు ఉపాధి హామీ కూలీలుగా మారి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పథకాన్ని వ్యవసాయరంగానికి అనుసంధానం చేయాలనేది సర్వత్రా వినిపిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పథకంపై ప్రత్యేక చొరవ తీసుకోకపోతుడటంతో ఉపాధి కూలీలకు పనిదొరకడం లేదు. హుజూరాబాద్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలుండగా మూడు గ్రామాలను హుజూరాబాద్ మున్సిపాలిటీలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ గ్రామాల్లో ఉపాధిపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డునపడనున్నాయి.

శ్రమ దోపిడీ

ఈజీఎస్ కూలీలు శ్రమదోపిడీకి గురవుతున్నారు. గ్రామాల్లో శ్మశానవాటిక, కాలువల పక్కన పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు, కాలువల తవ్వకం, పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టీలు, షెడ్ల నిర్మాణం, అదనపు తరగతుల నిర్మాణం, హరితహారంలో భాగంగా మొక్కలు నాటడం, చెరువుల్లో, కుంటల్లోని మట్టిని పొలాల్లోకి తరలించడం, కాలువ గట్లపై పిచ్చి మొక్కలను తొలగించి రోడ్డు సరి చేయడం, గ్రామాల్లో బావులు తవ్వించడం తదితర పనులను పథకం ద్వారా చేపడుతున్నారు. కూలీలకు జాబ్ కార్డులు అందజేసి వాటి ద్వారా జీత భత్యాలను చెల్లిస్తున్నారు. పొద్దంతా కష్టపడి పనిచేసినా కూలీ రూ.200 అందడం లేదు. దీనికి తోడు వేసవిలో అధికారులు ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి సౌకర్యాలు కల్పించడం లేదు. పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీటి వసతి, ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ తదితర చేపట్టాల్సి ఉంటుంది. కానీ అవేమి లేకపోయినా శ్రమనే ఆయుధంగా కుటుంబాన్ని పోషించాలనే ధృడ సంకల్పంతో కూలీలు పనిచేస్తున్నారు.

కూలీల ఆవేదన

ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయరంగంతో అనుసంధానం చేస్తే వ్యవసాయరంగంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తవుతాయని కూలీలు అంటున్నారు. కూలీ పనితో పాటు వ్యవసాయ రంగంలో మెళకువలు నేర్చుకొని అప్పొసొప్పు చేసి వ్యవసాయ భూములను కొనుగోలు చేసి సాగు చేసుకోవచ్చునని కూలీలు భావిస్తున్నారు. ఉపాధి డబ్బులు కూడా కూలీల అకౌంట్లలలో సమయానికి అనుగుణంగా జమ కావడం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. పండుగ పూట పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విలీన గ్రామాలు

హుజూరాబాద్‌ను మున్సిపాలిటీగా మార్చేక్రమంలో బోర్నపల్లి, ఇప్పలనర్సింగాపూర్, దమ్మక్కపేట గ్రామాలను విలీనం చేశారు. మున్సిపాలిటీ పరిధి మరింత పెంచేందుకు తాజాగా పెద్దపాపయ్యపల్లి, రంగాపూర్, రాంపూర్ గ్రామాలను విలీనం చేసేందుకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈమేరకు గ్రామాల విలీనానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలంటూ మున్సిపల్ కమిషనర్‌కు ఉత్తర్వులు రాగా నివేదికలను తయారు చేస్తున్నారు. దీంతో ఈ గ్రామాల్లో పనిచేస్తున్న కూలీలు ఉపాధి పనులకు దూరం కానున్నారు.

పేదలను ఆగం చేయొద్దు

ఉపాధి హామీ పథకంపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఆగం చేసేలా గ్రామాలను మున్సిపాలిటీలో కలిపే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి. నిరుపేదల బతుకులపై నీళ్లు చల్లొద్దు. ఈజీఎస్‌పై ఆధారపడి జీవిస్తున్న కూలీల దుస్థితిని గమనించి విలీన గ్రామాల ప్రక్రియ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. – బింగి కరుణాకర్, మాజీసర్పంచ్, రంగాపూర్

సావిత్రిబాయిపూలేకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: జమ్మికుంట రోడ్డులోని ఏరియా ఆసుపత్రి సమీపంలో జ్యోతిరావుపూలే చౌరస్తా వద్ద జ్యోతిరావుపూలే జయంతి కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సావిత్రిబాయిపూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహిళా విద్య కోసం చేసిన కృషిని స్మరించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, జ్యోతిరావు పూలే కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘుచారి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధిక, అంబేద్కర్ జయంతోత్సవ కమిటీ చైర్మన్ మహమ్మద్ ఖాలీద్ హుస్సేన్ తదితరులున్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వీణవంక: మండలంలోని చల్లూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1996 నుంచి 2001 వరకు పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలను తెలుసుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన టీచర్లు శాంతికుమార్‌సింగ్, రాంకుమార్, సత్యం, రాజు, శ్రీధర్, నరేందర్, వెంకటేశ్వర్లు సుదర్శన్, రాజిరెడ్డి, రవి, శ్రీనివాస్‌రెడ్డి, రాణి,జయప్రద శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జనార్దన్, మల్లారెడ్డి, సంతోష్, ప్రవీణ్, దేవదాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనులపై ప్రస్తావిస్తా



డ్రైయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

మానకొండూర్: గ్రామాల్లో మిషన్ భగీరథ పైపు లైన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, నీళ్లు రావడం లేదని దీనిపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం మానకొండూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగు చర్యలు వెంటనే చేపట్టాలని సూచించారు. ముందుగా గ్రామాల వారీగా తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. మానకొండూర్‌లోని ఎస్సీ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికకు దగ్గర ఉన్న మంచినీటిబావిని పరిశీలించి బావిలోకి వర్షపు నీరుపోకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాజీవ్‌నగర్ కాలనీని సందర్శించి ఓవర్ హెడ్‌ట్యాంకు నిర్మించి కాలనీ వాసులకు తాగునీరు అందించాలన్నారు. వేసవిలో మంచినీటి సమస్య నివారణకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నీటి సరఫరాకు కృషి చేయాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజినీర్ కె.రాములు, ఎంపీడీవో వరలక్ష్మి, గ్రిడ్ కార్యనిర్వాహక ఇంజినీర్ జె.రాంకుమార్, ఇంట్రా కార్యనిర్వాహక ఇంజినీర్ పి.అంజన్ రావు, మిషన్ భగీరథ గ్రిడ్ డీఈ ప్రసాద్ కుమార్, ఇంట్రా డీఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ అనిల్ కుమార్, ఇంట్రా ఏఈ వినవీన్,ఎంపీవో కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటలు ఎండకుండా కాపాడాలి



రైతుతో మాట్లాడుతున్న సుంకె రవిశంకర్

గంగాధర: పంటలు ఎండిపోతున్నా ఎమ్మెల్యేకు కనిపించడం లేదా అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని గర్షకుర్తి గ్రామంలో సాగునీరందక ఎండుతున్న పంటలను సోమవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొట్టదశలోని వరి ఎండిపోకుండా సాగు నీరందించాలని, ఎండిన పంటలకు ఎకరాకు రూ. ఇరవై వేల పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి అక్కడి నుంచి చెరువులు, కుంటలకు తరలించి పంటలను కాపాడాలన్నారు. ఏడాదిన్నర క్రితం వరకు నిరాటకంగా వచ్చిన గోదావరి జలాలు ప్రస్తుతం అరకొరగా వస్తున్నాయని, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నారాయణపూర్ గ్రామానికి వచ్చినపుడు ఎన్ని నిధులు అవసరమున్నా ఇస్తామన్నా హామీ ఉత్తదేనా అని ప్రశ్నించారు. రుణమాఫీ కాక, రైతుభరోసా రాక ఆందోళన చెందుతున్న రైతులను సాగునీటి సమస్య మరింత కుంగ తీస్తుందన్నారు. కష్టపడుతూ నష్టపోతున్న రైతులను ఆదుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు న్నారు.

వైద్యశిబిరం

జమ్మికుంట: ఆరోగ్యం ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. చందు అన్నారు. పట్టణంలోని సాయి మానసిక దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక పాఠశాలలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది దివ్యాంగ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందుల పంపిణీ చేశారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత, డ్రైడే, టీబీ నిక్షయ్ శిబిర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డా. మహోన్నతపటేల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాంనాయక్, సూపర్‌వైజర్ అరుణ, ప్రిన్సిపల్ రాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన

చిగురుమామిడి: మండలంలోని రేకొండ గ్రామంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, టీబీ వ్యాధులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పద్మపాని సొసైటీ ఆధ్వర్యంలో లింకు వర్కర్ కనకం మమత ఆధ్వర్యంలో వంద మంది మహిళల రక్తనమూనాలు సేకరించారు. రక్త పరీక్షలతో వ్యాధులు తెలిసే అవకాశం ఉందని, సత్వర చికిత్స తీసుకోవచ్చని మమత తెలిపారు. సీపీ శ్రీలత, ఏఎన్‌ఎం శైలజ, శ్వేత, ఆశ వర్కర్ పూజతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆయుష్ ఆసుపత్రి తనిఖీ

గన్నేరువరం: మండల కేంద్రంలోని ఆయుష్ ఆసుపత్రిని సోమవారం ఆయుష్‌శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి యస్రబ్ సుల్తానా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య, వసతులను పరిశీలించారు. మండల ఏర్పాటు సమయంలో ఆయుష్‌కు సంబంధించిన భవనాన్ని, పోలీస్‌స్టేషన్‌ను కేటాయించడంతో పాత గ్రామ పంచాయతీ భవనంలో అరకొర వసతులతో ఆసుపత్రి సేవలు కొనసాగుతున్నాయని, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని గుర్తించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి లేదని, పలుమార్లు ఆయుష్ కేంద్రాన్ని సందర్శించినా వసతుల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఆయుష్‌కు సంబంధించిన పాత భవనం వద్ద యోగా కోసం నూతన భవనాన్ని నిర్మించామని వివరించారు. పాత భవనాన్ని మళ్లీ కేటాయిస్తే యోగా కేంద్రం సేవలు అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. అలాగే ఖాళీగా ఉన్న ఆయుష్ వైద్యాధికారి పోస్టును భర్తీ చేయనున్నామన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు

మానకొండూర్: మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని వైద్యాధికారి సల్మాన్ గర్భిణులకు అవగాహణ కల్పించారు. పీహెచ్‌సీలో సోమవారం రక్తహీనత, తదితర పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రిలో మహిళా వైద్యాధికారులు అలాగే, అన్నిరకాల వసతులున్నాయని, ఏ సమయంలోనైనా అందరూ అందుబాటులో ఉంటారని నార్మల్ డెలివరీ గూర్చి వివరించారు. ప్రైవేటు ఆసుపత్రిలకు వెళ్లి ఖర్చుల పాలు కావొద్దని కోరారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్ అసిస్టెంటు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

జంగపల్లి పాఠశాల సందర్శన



విద్యార్థితో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు బాటు, అకాడమిక్ అడ్వైజర్ కర్ర అశోక్‌రెడ్డిలు సందర్శించారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించడానికి పాఠశాలలో అమలు చేస్తున్న కార్యాచరణ ప్రణాళికను, ప్రీ ఫైనల్ పరీక్షలు, ప్రత్యేక తరగతుల నిర్వహణను పరిశీలించారు.

వ్యవసాయ మార్కెట్ సందర్శన



మానకొండూర్: మానకొండూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తమిళనాడులోని కాంచీపురం, తిరువన్నమలై వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు, ఉపాధ్యక్షుడు రామిడి తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో మార్కెటులో కందులు, గోదాంలు, వరిధాన్యం, మిర్చి అమ్మకం, అక్కడి పాలకవర్గం పనితీరును, వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు బందెల మహేందర్, టేకుమల్ల అంజయ్య, మండల మహిపాల్, ఏల్పుగొండ రాజు, మాతంగి సహదేవ్, చలిగంటి ఓదెలు, రావుల రవి పాల్గొన్నారు.

‘రసమయికి ఆస్తులు ఎక్కడివి’



సాక్షి కథనం చూపిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి

తిమ్మాపూర్: మానకొండూరులో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడిన మాటలను కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఎల్‌ఎమ్‌డీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సహకార సొసైటీలలో గతంలో రసమయి రూ. లక్షలు డిమాండ్ చేసి ఎమ్మెల్యేను విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. గోసి గొంగడితో వచ్చి రూ. కోట్లు, 40 ఎకరాలు ఎలా సంపాదించావో చెప్పాలన్నారు. రసమయి ఆరోపణలను నిరూపించకపోతే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రసమయి బాలకిషన్ పెద్ద అవినీతిపరుడని అనారు. పార్టీ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఊట్కూరు వెంకటరమణారెడ్డి, అల్వాల కోటి, గంకిడి లక్ష్మారెడ్డి, రాఘవ రెడ్డి, గోపు మల్లారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతివ్వాలి

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఆవిష్కరణకు అనుమతివ్వాలని మాజీ జెడ్పీటీసీ ఇనుకొండ జితేందర్ రెడ్డి పొలిటికల్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. విగ్రహాల ఆవిష్కరణకు ఆటంకాలు తొలగించకుంటే పోరాటం ఉధతం చేస్తామని హెచ్చరించారు. విగ్రహాల ఆవిష్కరణ కోసం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన సోమవారం నుంచి చేపట్టిన రిలే నిరాహారదీక్షను సాంబారి కొమురయ్య ప్రారంభించారు. రెండేళ్ల క్రితం నెలకొల్పిన మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులకు వినతి పత్రాలిచ్చినా స్పంద లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సెలూన్ షాపు దగ్ధం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ క్రాస్ రోడ్డులోని సెలూన్ షాపులో రూ.లక్ష విలువ చేసే వస్తువులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన విజ్జిగిరి శివనాగేంద్ర ఆదివారం రాత్రి 9గంటలకు షాపు మూసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సెలూన్‌లో నుంచి మంటలు వస్తున్న విషయాన్ని గమనించిన స్థానికులు శివనాగేంద్రకు విషయం తెలిపారు. ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పేశారు. నలుగురిపై అనుమానం వ్యక్తం చేస్తూ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

బైక్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్న కారు

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామ శివారులో బైక్‌ను తప్పించబోయిన కారు డివైడర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. హుజూ రాబాద్ మండలం పెద్దపాపయ్యపల్లి, ఇప్పలనర్సింగాపూర్ గ్రామాలకు చెందిన చల్లూరి రాజయ్య, కొండాల్‌రెడ్డి కరీంనగర్‌లో పని ముగించుకొని సోమవారం తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో వీరు ప్రయాణిస్తున్న కారు బైక్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టింది.

కేసు నమోదు

జమ్మికుంట: చిట్‌ఫండ్స్ కార్యాలయం ధ్వంసం చేసిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. ఇల్లందకుంట మండలానికి చెందిన వ్యక్తి చిట్టీ డబ్బులు మొత్తం చెల్లించకపోవడంతో చిట్‌ఫండ్స్ నుంచి రిమైండర్ నోటీస్ పంపించారు. కార్యాలయానికి చేరుకున్న మేనేజర్ క్యాబిన్‌ను ధ్వంసం చేశాడు.

విద్యుత్ అధికారుల పొలంబాట



సైదాపూర్: మండలంలోని ఎలబోతారం గ్రామ పంచాయతీ పరిధి చింతలపల్లిలో విద్యుత్ అధికారులు సోమవారం పొలంబాట నిర్వహించారు.విద్యుత్ సరఫరా తీరు, ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హుజూరాబాద్ ఏడీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది, మాజీ సర్పంచ్ మ్యాకల శిరీష, రైతులు మ్యాకల ముకుందరెడ్డి, కోమల్‌రెడ్డి ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గంగాధర: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తోందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి ఇంటగ్రేటెడ్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.రెండువందల కోట్లు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ మండల అధ్యక్షుడు పురమల్ల మనోహర్ ఆధ్వర్యంలో మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు సోమవారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, జాగిరపు శ్రీనివాస్‌రెడ్డి, వేముల భాస్కర్, తోట సంధ్య, కరుణాకర్, బూర్గు గంగన్న, సత్తు కనుకయ్య, పరందాములు, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, పడాల రాజన్న, గుజ్జుల బాపురెడ్డి, పెంచాల చందు, మహేశ్, అట్ల రాజశేఖర్‌రెడ్డి, వేముల అంజి, సుదర్శన్, మంత్రి మహేందర్, మ్యాక వినోద్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన



జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని 17, 20వ వార్డుల్లో రైల్వే గోడ నిర్మాణంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని కొత్తపల్లికి చెందిన బాధిత కుటుంబాలు, ప్రజలు కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కొత్తపల్లి రైల్వేస్టేషన్‌ను ఆనుకొని ఉన్న స్థలంలో మాస్టర్ ప్లాన్ ప్రకారం 12 ఫీట్ల రోడ్డు ఉందని, గతంలో ఇళ్లకు చిన్నచిన్న దారులుండేవని, వాటిని రైల్వే అధికారులు మూసి వేస్తున్న సందర్భంగా మున్సిపల్ అధికారులకు ఫిబ్రవని 27న ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. దారి సమస్య పరిష్కరించని పక్షంలో రిలే దీక్ష చేపడతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకన్న, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ సలీం పాషా, గ్రామస్తులు సాగర్, రంజిత్‌రెడ్డి, మారుతిరెడ్డి, రాహుల్, వంశీ, ఐల య్య, స్వరూప, రేణుకా, అబేదా, ఝాన్సీ, రజిత, రాజేశ్వరి న్నారు.

కల్యాణం కమనీయం



తిమ్మాపూర్: నల్లగొండ సీతారామలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా హాజరయ్యారు. దాతలు తమ్మిశెట్టి మల్లయ్య, దోనపటి మహి పాల్ రెడ్డి, మార్క సంపత్, గాజుల సతీష్, శివరాత్రి రమేష్, మార్క సంపత్, గోపాగోని సంపత్,మూర్తి శ్రీనివాస్ అన్నదానం నిర్వహించారు. ఈవో, చైర్మన్లు కల్యాణానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ఎల్‌ఎండీ ఎస్సై వివేక్ బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.